క్లుప్తంగా

స్నేహితురాలి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న మిత్రులు

తల్లాడ: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మహిళకు తన తోటి మిత్రులు చేయూత అందించారు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కాంపల్లి వెంకటరమణ భర్త ముత్తయ్య ప్రమాదంలో గాయపడగా తనతో పాటు చదువుకున్న 1995–96 బ్యాచ్ పదో తరగతి మిత్రులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి సైదులు, గాదె కృష్ణారావు, ఎస్.కె.ఫిరోజ్, మేడి సీతారాములు, వేమిరెడ్డి కృష్ణకుమారి, కొమ్మినేని ఉమా, జొన్నలగడ్డ మమత పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



మందులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. వైద్యాధికారులు పవన్‌కుమార్,గంగాధర్ గుప్తా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ప్రతీ నెల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు క్యాంప్ నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఆకెన పవన్, యంగల ఆనందరావు, గిరి, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు సర్వీసులు పెంపు

సత్తుపల్లి టౌన్: వేసవి సెలవులు ముగుస్తుండటంతో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసులు పెంచినట్టు సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి ఆదివారం తెలిపారు. 18 రెగ్యులర్ సర్వీసులతో పాటు ఆరు అదనపు సర్వీసులు పెంచినట్టు తెలిపారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు

చింతకాని: మండలపరిధిలోని రాఘవాపురం గ్రామంలో దొబ్బల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను వారి కుటుంబసభ్యులు ఆదివారం ప్రారంభించారు. వెంకటేశ్వర్లు కుమారుడు దొబ్బల దినేష్, అల్లుడు చింతనిప్పు ప్రవీణ్ రూ. 2.50 లక్షల వ్యయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో గ్రామ ప్రజలందరూ భాగస్వాములై గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండపర్తి గోవిందరావు, కొల్లి సీతయ్య, సింగరావు సత్యనారాయణ, అబ్బూరి మహేష్, దొబ్బల బాబు, సీతారామయ్య, నారాయణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు కృషి చేయాలి

మధిర: ప్రతి ఒక్కరూ సమాజసేవకు కృషి చేయాలని ప్రముఖ సామాజిక సేవకులు, ఆరోగ్య పర్యవేక్షకులు లంకా కొండయ్య తెలిపారు. మధిర పట్టణంలోని ఆజాద్ రోడ్‌లో కొండయ్య నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకు ద్వారా దాతల నుంచి సేకరించిన దుస్తులను ఇల్లందులపాడు సమీపంలో నివసిస్తున్న వలస కూలీలకు ఆదివారం ఉచితంగా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు వేము కిరణ్ కుమార్, శ్యామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న కొండయ్య

పదేళ్లుగా అడ్డంకులే..

స్థలం ఉన్నా నిర్మాణానికి నోచుకోని స్త్రీ శక్తి భవనం

- అద్దె భవనంలోనే కాలం వెళ్లదీస్తున్న మండల సమాఖ్య కార్యాలయం
- రెండు సార్లు శంకుస్థాపన
- నిర్మాణంలో జాప్యంతో నిధులు వెనక్కు



స్త్రీ శక్తి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం (ఇన్‌సెట్) నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

తల్లాడ: మహిళా సాధికారిత కోసం గత ప్రభుత్వం మండలానికో స్త్రీ శక్తి భవనం నిర్మించాలని తలంచి నిధులు కూడా మంజూరు చేసింది. అయినా తల్లాడ మండల స్త్రీ శక్తి భవనం మాత్రం నిర్మాణానికి నోచుకోలేదు. పదేళ్లుగా ఈ భవన నిర్మాణం విషయంలో పట్టిన గ్రహణం వీడటం లేదు.

వివాదాస్పదంగా స్థలం..

తల్లాడ స్త్రీ శక్తి భవనానికి పదేళ్ల క్రితం నిధులు మంజూరు కాగా స్థానిక పంచాయతీ స్థలంలో ఎంపీడీఓ కార్యాలయం పక్కనే నిర్మించాలని స్థలం కేటాయించారు. అప్పటి మంత్రి ఇక్కడ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయగా అప్పట్లో ఈ స్థలం వివాదాస్పదంగా మారింది. కొందరు పంచాయతీ స్థలాన్ని స్త్రీ శక్తి భవనానికి కేటాయించొద్దని కోర్టును ఆశ్రయించారు. దీంతో అప్పట్లో భవన నిర్మాణం నిలిచిపోయింది. ఇక్కడ నుంచి తల్లాడ సమీపంలోని నారాయణపురం గ్రామంలో రాష్ట్రీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్త్రీ శక్తి భవనానికి కేటాయించారు. దీంతో 2017 అక్టోబర్ 29న అప్పటి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, భవన నిర్మాణానికి రూ. 28 లక్షలు కేటాయించారు.

పనులు ప్రారంభం కాక నిధులు వెనక్కు..

భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా అప్పట్లో పనులు ప్రారంభం కాలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లాయి. నిధుల ల్యాప్స్ కావటంతో ఆ స్థలంలో శిలాఫలకమే దర్శనమిస్తుంది. ఈ స్థలాన్ని 2019లో రైతువేదిక భవన నిర్మాణాన్ని స్థలాన్ని కేటాయించారు. తిరిగి రైతువేదిక భవనం ఎన్‌ఎస్‌పీ స్థలంలో నిర్మించటంతో మళ్లీ యథాతదంగా స్త్రీ శక్తి భవనానికి స్థలం కేటాయించారు.

డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బందికి తప్పని తిప్పలు..



అద్దె భవనంలో నిర్వహిస్తున్న మండల సమాఖ్య కార్యాలయం

అద్దె భవనంలో నిర్వహిస్తున్న మండల సమాఖ్య కార్యాలయంలో వెలుగు సిబ్బందికి, డ్వాక్రా మహిళలకు ఇబ్బందులు తప్పడం లేదు. డ్వాక్రా గ్రూపుల సమావేశం, సమాఖ్య సభ్యులు సమావేశం, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు శిక్షణ వంటి సమయాల్లో భవనం ఇరుకుగా ఉంటుంది. బ్యాంక్ లింకేజీ పనుల కోసం నిత్యం డ్వాక్రా మహిళలు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. మండల వ్యాప్తంగా 52 గ్రామ సమాఖ్యలు, 1,400 గ్రూపులు, 15,138 డ్వాక్రా మహిళలున్నారు. గ్రామం లోపల పాత భవనంలో మండల సమాఖ్య కార్యాలయం నిర్వహిస్తున్నారు. కొత్త భవనం అద్దెకు తీసుకోవాలంటే రూ.10 వేల వరకు అద్దె ఉంటుంది. దీంత పాత భవనంలోనే మండల సమాఖ్య కార్యాలయం కొనసాగుతోంది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి భవనం నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



పదేళ్లుగా స్త్రీ శక్తి భవనం నిర్మాణం జరగక ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనంలో సమావేశాలు, శిక్షణలు నిర్వహించాల్సి వస్తోంది. అద్దె భవనంతో ఇబ్బందులు పడుతున్నాం. బాత్‌రూమ్స్, టాయిలెట్స్ లేక మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– కందాల తేరోజమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు, తల్లాడ

భవనం నిర్మించాలి..



వెనక్కి వెళ్లిన నిధులను మళ్లీ మంజూరు చేసి వెంటనే భవన నిర్మాణం చేపట్టాలి. మండలంలోని సీసీలు, డ్వాక్రా మహిళలు, వీఓఎలు భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిధులు మంజూరు చేసి ఖాళీగా ఉన్న స్థలంలో భవనం నిర్మించాలి.

– మన్నేపల్లి సుభద్ర, సీసీ, బిల్లుపాడు

పనులు ప్రారంభించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి

స్థలం కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించక జాప్యం చేయడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. తిరిగి నిధులు మంజూరు చేసి కేటాయించిన స్థలంలో పనులు ప్రారంబించాలి. మండలంలోని డ్వాక్రా మహిళలందరికీ ఈ భవనం సౌకర్యంగా ఉంటుంది. భవనం లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

– జి.చిన్న వెంకటేశ్వర్లు, ఏపీఎం, తల్లాడ

మోడల్ మున్సిపాలిటీగా మధిర

- రూ.128 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు
- సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న భట్టి

మధిర: మధిర మున్సిపాలిటీని అభివృద్ధిలో ఒక మోడల్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు, స్థానిక నాయకులు సమష్టిగా కృషి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మధిరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం, అఖిలపక్ష నేతలతో కలిసి మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ప్రస్తుతం ఉన్న సమస్యలపై డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధిర పట్టణానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, అభివృద్ధిని భారంగా భావించే వారిని వదిలించుకునేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కోడ్ ముగిసిన వెంటనే ఒక్కరోజు కూడా వృథా కాకూడదనే ఉద్దేశంతో మధిర పట్టణ అభివృద్ధి లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు గాను రూ.128 కోట్లు కేటాయిస్తూ ఇప్పటికే జీవో విడుదలైన విషయాన్ని గుర్తు చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అధికారుల పనితీరుపై ప్రతినెల సమీక్ష చేస్తామని, నిర్లక్ష్యంగా ఉంటే వదిలించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మున్సిపాలిటీలో వాహనాలకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, కౌన్సిలర్లు, వివిధ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులు మధిర పట్టణ అభివృద్ధికి సూచనలు చేశారు. అదేవిధంగా ఏపీలోని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య భట్టి విక్రమార్కను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు.

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్ష



విజయ కళాశాలలో పరీక్ష రాయడానికి వెళ్తున్న అభ్యర్థులు



పోలీసుల బందోబస్తు

కొణిజర్ల: కొణిజర్ల మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాల, బ్రౌన్స్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభం అవ్వగా అభ్యర్థులు 8 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. అధికారులు నిశితంగా పరిశీలించిన అనంతరం ఉదయం 9 గంటలనుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద సరైన బోర్డులు లేక అభ్యర్థులు తిక మక పడి రెండు కళాశాలల్లో తిరిగారు. విజయ ఇంజనీరింగ్ కళాశాలలో 504 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 367 మంది పరీక్షకు హాజరయ్యారు. బ్రౌన్స్ ఫార్మసీ కళాశాలలో 264 మందికి గాను 196 మంది పరీక్షకు హాజరవ్వగా 68 మంది పరీక్ష రాయలేదు. వైరా సీఐ సాగర్ నాయక్ నేతృత్వంలో వైరా సర్కిల్ పరిధిలోని పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ మధుసూధన్ సందర్శించారు.

సత్తుపల్లి నుంచి 21 బస్సులు..

సత్తుపల్లిటౌన్: ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్షకు హాజరయ్యేందుకు సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి 21 బస్సులు నడిపారు. తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం 7.50 గంటల వరకు ఈ సర్వీస్‌లను ఏర్పాటు చేయటంతో అభ్యర్థులు పరీక్షలకు సకాలంలో హాజరయ్యారు. అదే విధంగా సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి ఆర్టీసీ ఉద్యోగులు అభ్యర్థులకు బస్సుల సమాచారం అందించారు. డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, సూపర్‌వైజరర్లు రామ్‌కుమార్, టి.సుబ్బారావు, బాలస్వామి, వీబీఓ కిన్నెర ఆనంద్ పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ఎమ్మెల్యేకు ఘన సన్మానం..



దయానంద్‌ను సన్మానిస్తున్న యాజమాన్యాలు

సత్తుపల్లి: ఇటీవల నిర్వహించిన ఎంపీ, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అధిక మెజార్టీ సాధించడంపై సత్తుపల్లి పట్టణ ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి, నాయకులు దయానంద్‌లను ఆదివారం సత్తుపల్లిలో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఒగ్గు భగవాన్‌రెడ్డి, నాయుడు వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళీ పాల్గొన్నారు.

నివాళి..

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని గీతమ్స్ కళాశాల రోడ్డులోని వంగా శ్రీను కుమారుడు వంగా నాగవంశీ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామోజీరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

వైరా: రామోజీ గ్రూప్ ఆఫ్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతిపై వైరా కమ్మజన మహాసంఘం సంతాపం ప్రకటించారు. ఆదివారం వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు రామోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు చింతనిప్పు వెంకటేశ్వరరావు, సభ్యులు కట్టా కృష్ణార్జునరావు, సూర్యదేవర శ్రీధర్, శ్రీరామనేని విజయ భాస్కర్, కర్నాటి హనుమంతరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, హనుమంతరావు, శ్రీమంత్,, కిషోర్, రవి, శ్రీకాంత్, రాము పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయాన్ని గౌరవించి పరిపాలించాలి



మాట్లాడుతున్న ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: బీజేపీ మోదీని నివారించిన దేశ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడంలో సఫలీకృతం అయ్యారని, ప్రజాభిప్రాయాన్ని గౌరవించి పరిపాలించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని లౌకికవాదాన్ని కాపాడుతూ సుపరిపాలన అందించాలని లేదంటే బీజేపీకి మోదీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ పేదలు, కార్మికులు, కష్ట జీవులు, రైతులుపై వారి చట్టాల పట్ల అవగాహన కలిగి రైతుల కోసం తెచ్చిన నల్ల చట్టం రద్దు చేయాలన్నారు. నిమ్మటూరి రామకృష్ణ, టి.యోబు, వీరభద్రం, రాజు, తిరుపతమ్మ, కుమారి, రాజమ్మ, రాములమ్మ, శ్రీను, సత్యనారాయణ, యాకూబ్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తల్లాడ: విద్యుత్ శాఖలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనీ టీజీయూఈఈయూ (సీఐటీయూ) ఖమ్మం జిల్లా కార్యదర్శి ఎం.ప్రసాద్ అన్నారు. తల్లాడలో ఆదివారం జరిగిన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా డివిజనల్ ఇంజనీర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లకు దరఖాస్తులు అందజేయనున్నట్లు తెలిపారు. సోమవారం వరంగల్‌లో సీఎండీనీ కలిసి డిమాండ్ల పత్రాన్ని ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 14 వ తేదీన సీఎండీనీ కలవనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు ఉగ్గం వెంకటేశ్వర్లు, సూర్యప్రకాశరావు, వైరా కార్యదర్శి గురునాథం, తుమ్మల ప్రకాశ్‌రావు, బిల్ కలెక్టర్లు అశోక్, నాగార్జున, సురేష్, వంశీ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

చింతకాని: ఈనెల 16న ఖమ్మంలో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఖమ్మం ఏరియా 5వ మహాసభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో మహాసభ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందన్నారు. పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, లేనిపక్షంలో పంచాయతీ వర్కర్లను ఐక్యపరిచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు, నాయకులు ఆడెపు కోటేశ్వరరావు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, భాషా, జయ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

తల్లాడ: దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ, మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి, బాణా సంచా కాల్చారు. నాయకులు దూపాటి భద్రరాజు, చల్లా నాగులు, గాదె కృష్ణారావు, తమ్మిశెట్టి కృష్ణ, చల్లా నగేష్, వాడవల్లి నాగేశ్వర్‌రావు, పెరికె కిరణ్, బాలాజీ నాయక్, నాగేశ్వరరావు, అశోక్, నున్నా రామారావు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి రింగ్ సెంటర్‌లో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, నాయకులు పాలకొల్లు శ్రీను, నాగస్వామి, శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కారేపల్లి: కారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. రెండు దశాబ్దాల తర్వాత కారేపల్లి హైస్కూల్‌లో కలుసుకున్న ఆనాటి పూర్వవిద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రామయ్య, భీమవరపు శ్రీనివాసరావు, ఝాన్సీ, భారతి, బ్రహ్మరెడ్డి, విజయ్‌కుమార్, శ్రీలత, పద్మావతి, రెబక, పూర్వ విద్యార్థులు మురళీ, సురేష్, రాము, సమీర్, వీరభద్రం, అలీం, ప్రసాద్, సుధాకర్, ఉడతల సంపత్, సత్యం, రాజు, నూర్జాహాన్, కరుణ, స్వాతి, హేమ, ఉమా, నాగాచారి, శివరాణి, రాధిక, సరిత తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరు పారేదెలా..?

- మరమ్మతులకు నోచుకోని చెరువు తూము షట్టర్లు
- ఆయకట్టు రైతుల ఆందోళన
- నిధులు మంజూరైనా చేపట్టని పనులు
- ప్రశ్నార్థకంగా మారిన ఆయకట్టు




బనిగండ్లపాడు గ్రామంలోని ఊర చెరువు



మరమ్మతుకు గురైన తూము షట్టర్లు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం–బనిగండ్లపాడు గ్రామాల మధ్యలోని ఊర చెరువు నుంచి పంట పొలాలకు సాగునీరు పారేదెలా అంటూ ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వర్షాధారమైన ఈచెరువు ఆయకట్టు దాదాపు 70 ఎకరాలకు పైగా ఉంది. కట్లేరు కాల్వ ద్వారా కూడా చెరువులోకి సాగు నీరు వస్తుంది. కాగా గత కొన్నేళ్లుగా ఈ చెరువు కింద ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తూము షటర్లు శిథిలమయ్యాయి. చెరువులోకి చేరిన వర్షం నీరు తూము షట్టర్లు మరమ్మతులకు గురి కావడంతో నీరు బయటకు వృథాగా పోతోంది. ప్రతీ ఏటా తూముల నుంచి బయటకు పోకుండా ఇసుక బస్తాలు అడ్డుగా వేసి కాపాడుకుంటున్నారు. చెరువు నిండా తూటికాడ కూడా బాగా పెరిగింది. పలుమార్లు ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు మొర పెట్టుకుంటే మరమ్మతుల కోసం అసెంబ్లీ ఎన్నికలకు ముందే రూ.4.5లక్షల నిధులు కూడా మంజూరు చేసింది. పనుల నిర్వహణలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. గతంలో మిషన్ కాకతీయ పనులు చేపట్టినప్పటికీ ఐదేళ్లుగా చెరువులో పనులు ఏమీ చేపట్టలేదు. పంటలు వేసే సీజన్ దగ్గర్లోనే ఉండటం, రుతుపవనాల వర్షంతో చెరువు నిండే అవకాశం ఉండటంతో సకాలంలో ఇరిగేషన్ అధికారులు స్పందించి తూములు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఎన్నాళ్లు ఈ అగచాట్లు పడాలి



ఇంకా ఎన్నాళ్లు ఈ అగచాట్లు పడాలి. చెరువు అలుగు వద్ద షట్టర్లు, తూములు రిపేర్లు చేయాల్సి వుంది. నిధులు విడుదల చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదు. మరమ్మతులు చేయకపోతే చెరువులో చుక్క నీరు కూడా ఉండదు. ప్రతీ ఏటా తూము నుండి నీరు బయటకు వెళ్లకుండా ఇసుక బస్తాలేసి కాపాడుకుంటున్నాం.

– తల్లపురెడ్డి వెంకటరెడ్డి, రైతు, బనిగండ్లపాడు


అధికారులు చర్యలు తీసుకోవాలి



చెరువు ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారకముందే అధికార యంత్రాంగం స్పందించి తూములు, షట్టర్లకు మరమ్మత్తుల పనులు పూర్తి చేయాలి. సమస్యలను పలుమార్లు పాలకులకు, అధికారులకు విన్నవించినా స్పందన లేదు. ఇలా అయితే ఆయకట్టు రైతులకు సాగు నీరు దక్కని పరిస్థితి ఉంది. తక్షణ చర్యలు తీసుకోవాలి

– జంగా పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్, బనిగండ్లపాడు

త్వరలోనే మరమ్మతులు చేపడతాం



చెరువు తూము రిపేర్లకు నిధులు మంజూరైన విషయం వాస్తవమే. పనుల నిర్వహణలో ఎన్నికల విధులు నేపథ్యంలో కొంత జాప్యం జరిగింది. వర్షాకాలం సీజన్ దగ్గర్లనే ఉన్న కారణంగా త్వరలోనే చెరువు తూముకు మరమ్మతులు చేపడతాం.

– సాంబశివరావు, ఇరిగేషన్ డీఈ